క్లుప్తంగా

నేడు ఎల్మినేడులో కంటి వెలుగు ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడులో సోమవారం కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఎల్మినేడు సర్పంచ్ ఎడ్మా అశోకవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎల్మినేడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఎల్మినేడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సీసీ రోడ్ల పనులు పూర్తిచేయండి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఈజీఎస్ నిధులతో వెంటనే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎంపీపీ కొప్పు సుకన్య ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ..నిధులు మంజూరైన గ్రామాల్లో వారం, పది రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. మార్చిలోపు రోడ్ల పనులు ప్రారంభించి పూర్తి చేయకపోతే నిధులు వెనక్కిపోయే అవకాశం ఉందని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సీసీ రోడ్ల పనులు పూర్తిచేయాలని ఆమె సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

తలకొండపల్లి: నిరుపేదలకు ఖరీదైన వైద్యం అందించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వంటి అనూహ్య సంఘటనల కారణంగా ఆస్తులు, జీవనోపాధి కోల్పోయిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అండగా ఉంటుందన్నారు. మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన భాషమోని మోహన్‌కు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.53,500 సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం శ్రీనివాసుయాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు వెల్జాల్‌లో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబర్ రహ్మాన్, మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య, గిరి, శ్రీను, బందులాల్, వెంకటయ్య, రవి,జంగయ్య, సత్యంగౌడ్, నిరంజన్, మల్లేష్ యాదవ్, శ్రీశైలం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: రోడ్లు, తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వాటర్‌ట్యాంక్‌లు, అంతర్గత రహదారుల నిర్మాణాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని వెల్జాల్‌లో ఆయన జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ముజీబుర్ రహ్మాన్ స్థానిక నాయకులతో కలిసి సీసీరోడ్డు నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో మంజూరైన రూ.5 లక్షల ఉపాధిహామీ నిధులతో సీసీరోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రహ్మాన్, ఉపసర్పంచ్ అజీజ్, ఎంపీటీసీ అంబాజీ, వార్డు సభ్యులు యాదయ్య, శ్రీను, జంగయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ ఎక్సలెంట్ లియోక్లబ్ అధ్యక్షుడిగా రాజేశ్



రాజేశ్‌ను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కడ్తాల్: లియోక్లబ్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు క్యామ రాజేశ్ బెస్ట్ ఎక్సలెంట్ లియోక్లబ్ అధ్యక్షుడి అవార్డు అందుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో జరిగిన విజయం రీజియన్ మీట్ జోన్‌లో నాగర్‌కర్నూల్ ఎస్పీ మనోహర్, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, లయన్ బావండ్ల వెంకటేశ్ సమక్షంలో ఈ అవార్డును అందజేశారు.లియోక్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, మొక్కలునాటడం, నేత్ర, మధుమేహ పరీక్ష శిబిరాలు నిర్వహించడం, విద్యార్థులకు ఆర్థికసాయం, వజ్రోత్సవ ర్యాలీలు నిర్వహించడం, వీల్ మీల్స్ తదితర సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు అందజేశారని రాజేశ్ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు ఎస్‌బీఐ ఎదుట ధర్నా

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక పాలనకు నిరసనగా సోమవారం ఆమనగల్లు పట్టణంలోని ఎస్‌బీఐ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాకు ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రముఖులు హాజరవుతున్నారని ఆయన చెప్పారు.

కాలుష్య కోరల్లో మాసబ్ చెరువు

- శ్రీరంగాపూర్ కాలనీ తూము వద్ద చనిపోయిన చేపలు
- కాలనీలు, కాలువల ద్వారా చెరువులో చేరుతున్న కలుషిత జలాలు
- అధికారుల మధ్య సమన్వయ లోపం
- రోగాలబారిన స్థానికులు



శ్రీరంగాపూర్ కాలనీ తూము వద్ద చనిపోయిన చేపలు

తుర్కయంజాల్: మాసబ్ చెరువులో కలుషిత జలాలు, మురుగు నీరు కలవడం వల్ల చేపలు పెద్దఎత్తున మృతి చెందడం కలకలం రేపుతుంది. ఇంజాపూర్‌లోని 24వ వార్డు శ్రీరంగాపురం కాలనీ వద్ద గల తూము వద్ద పెద్ద సంఖ్యలో చేపలు చనిపోవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతుంది. అయినా ఇరిగేషన్, మత్స్యశాఖ, మున్సిపల్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. రెండు శాఖల మధ్య సమన్వయం కొరవడటంతో చేపలు చనిపోవడంతో పాటు ప్రజలు దుర్వాసనను భరించక తప్పడం లేదు.

ఎస్టీపీలు లేకపోవడంతో....

ఇరిగేషన్ శాఖ నిబంధనల ప్రకారం చెరువులో నేరుగా ఇళ్ల నుంచి వెలువడే డ్రైనేజీ వ్యర్థాలను కలవనీయకూడదు. అయినప్పటికీ బడంగ్‌పేట కార్పొరేషన్ నుంచి రెండు కాలువల ద్వారా, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ, కమ్మగూడ, తుర్కయంజాల్‌లోని పలు కాలనీల ద్వారా వెలువడే వ్యర్థాలను నేరుగా కాలువల ద్వారా చెరువులోకి వదులుతున్నారు. దీంతో ఒకప్పుడు మంచినీటి చెరువు కాస్తా, కళ్ల ముందే మురికి కూపంగా మారుతుంది. అయినా ప్రజా ప్రతినిధులు, అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదు. మురుగు నీటి కాలువల్లో ఇళ్ల మధ్యలో ఉన్న చిన్నచిన్న కుటీర పరిశ్రమల వ్యర్థాలు చేరుతుండటం కూడా మరింత ప్రమాదకరంగా మారింది. తుర్కయంజాల్‌లో రూ.40 కోట్ల వ్యయంతో రెండు ఎస్టీపీలు నిర్మిస్తామని మంత్రి కేటీఆర్ ఏడాది క్రితం ప్రకటించినా నేటికీ ఆ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు.

ఏ అవసరం లేకపోయినా...

తూము నుంచి గతంలో పంటల సాగు ఉన్న సమయంలో నీరు వదిలే వారు. నేడు రియల్ ఎస్టేట్ ప్రభావంతో పంట పొలాలు అన్నీ కాలనీలు, ఇళ్లుగా మారాయి. ఏ అవసరం లేకున్నా వృథాగా తూము నుంచి నీరు ప్రవహిస్తున్నా ఇరిగేషన్ అధికారులు దాన్ని పట్టించుకోవడం లేదు. చెరువు చుట్టూ ఉన్న పొలాల్లో వెంచర్లు చేసిన రియల్ వ్యాపారుల మెప్పు కొరకే ఈ విధంగా చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇంజాపూర్‌లోని శ్రీరంగాపురం, సాయినాథ్ కాలనీ, ఆపిల్ అవెన్యూ కాలనీ, ఇందిరమ్మ కాలనీల గుండా ఈ తూము నీరు ప్రవహిస్తుండటంతో ఆ కాలనీల మధ్య చనిపోయిన చేపలు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది.



మాసబ్ చెరువులో వ్యర్థాలు

దుర్వాసన భరించలేకపోతున్నాం

తూము నుంచి నీరు వదులుతుండటం, దాని ద్వారా చేపలు వచ్చి చనిపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యను పరిష్కరించాలి.

– శ్రీనివాస్ రెడ్డి, శ్రీరంగాపురం కాలనీవాసి

చర్యలు చేపడతాం

తూము కాలువలో చేపలు చనిపోయిన విషయం తెలిసింది. సోమవారం కాలువ స్థలంతోపాటు మాసబ్ చెరువును విజిట్ చేసి ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులతో చర్చిస్తాం. చనిపోయిన చేపల వ్యర్థాలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సత్వరమే చర్యలు చేపడతాం.

– సాబేర్ అలీ, కమిషనర్, తుర్కయంజాల్

విచారణ జరిపిస్తాం

చెరువులో చేపలు చనిపోయిన విషయం మా దృష్టికి రాలేదు. సిబ్బందిని అక్కడికి పంపించి వివరాలు అడిగి తెలుసుకుంటాను. చేపలు చనిపోవడానికి గల కారణాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. విచారణ జరిపిస్తాం.

– ఉషారాణి, డీఈఈ, ఇరిగేషన్ శాఖ

ఎన్నికల హామీలపై నిలదీయండి

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



జగదీశ్‌రావుకు నియామకపత్రం అందజేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: రెండోసారి ఎన్నికల్లో గెలుపొందడం కోసం కేసీఆర్ ఇచ్చిన హామీలపై బీఆర్ఎస్ శ్రేణులను ప్రశ్నించాలని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు పార్టీ బలోపేతంపై చర్చించేందుకు గాను నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు మాయమాటలతో గ్రామాల్లోకి వస్తున్నారని, ప్రజల పక్షాన ప్రశ్నించాలని సూచించారు. ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ నేరవేర్చడం లేదని మండిపడ్డారు. పరిశ్రమలు, ప్రాజెక్టుల పేరుతో దళితుల భూములనే లాక్కుంటున్నారని అన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినాతెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని అన్నారు.

మండల ప్రధాన కార్యదర్శి నియామకం

యాచారం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన జగదీశ్‌రావును నియమిస్తూ మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం నియమాక ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీశైలం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మల్లేష్, రామచారి, సుధాకార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పథకాలు దేశానికే ఆదర్శం

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్సీ కసిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

ఆమనగల్లు: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన చూసి వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఆదివారం మాడ్గుల మండలానికి చెందిన జగన్‌గౌడ్, సంతోష్ పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు చెప్పిన విధంగా అన్ని హామీలను నెరవేర్చడమే కాకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్సీ చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, విజయ్, బాబా తదితరులు ఉన్నారు.

కళాకారులను ఆదరిస్తాం

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి



కళాకారులను అభినందిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

తలకొండపల్లి: అంతరించి పోతున్న కళలను ఆదరిస్తామని, కళాకారులకు అండగా ఉంటామని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వీరన్నపల్లిలో పంతులు వెంకటేశ్వర్లు బృందం ఆధ్వర్యంలో చిడతల భజనలో చిన్నారులతో పాటు, భజనపై ఆసక్తి ఉన్నవారికందరికీ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గత నెల రోజులుగా 25 మందికి నేర్పిస్తున్నాడు. శనివారం రాత్రి శిక్షణ పొందిన భజన కళాకారులతో వారు నేర్చుకున్న సంకీర్తనలపై ఆటపాటలతో అభినయ నృత్య కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాఘవేందర్ రెడ్డి, బీజేపీ నేత తల్లోజు ఆచారి, వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మాజి ఎంపిపి శ్రీనివాసుయాదవ్, సర్పంచ్ నాగమణి, లింగంగౌడ్ హాజరైనారు. రాఘవేందర్‌రెడ్డి చిన్నారులు, కళాకారులకు రూ. 21,000 ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా అర్జున్‌రెడ్డి, ఆచారి, శ్రీనివాసుయాదవ్, జెడ్పీటీసీ వెంకటేశ్, సర్పంచ్ నాగమణిలింగగౌడ్, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డిలు కలిసి సుమారుగా రూ.50,000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగమణి, లింగంగౌడ్, జయమ్మ, వెంకటయ్య, అనురాధా, నరేందర్‌గౌడ్, ఉపసర్పంచ్ కొండల్, ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్, గోవర్ధన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, డేవిడ్, ఈదమయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ

ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి



కడ్తాల్: కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్న వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే రైతులకు రూ.2 లక్షల పంట రుణాల మాఫీతో పాటు, రూ.5లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకం అమలు, రూ.500కే వంటగ్యాస్, ఇందిరమ్మ ఇళ్ల వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయనుందని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ×హాత్ సే హాత్ జోడో× యాత్రలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని చల్లంపల్లి, వంపుగూడ గ్రామాల్లో కొనసాగిన పాదయాత్రలో వంశీచంద్‌రెడ్డి పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సర్పంచ్ సేవ్యా, గ్రామ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, నాయకులు ఉన్నారు.

కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు..

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన యాట నర్సింహ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన బీచ్యానాయక్‌ను, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. భవిష్యత్ పదవులు వస్తాయన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు రాములు, పాండునాయక్, సేవ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు ఉన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి..

మంచాల: మండల పరిధిలోని ఆస్మత్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని ఆదివారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నపార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్, రాజు, లింగంగౌడ్, మంతని వెంకటేష్, పర్వతాలు, సత్తయ్య, గణేష్,కృష్ణ, భాషయ్య, లింగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మాటమార్చింది

మాదిగల సంగ్రామ యాత్రలో ఎమ్మార్పీఎస్ శ్రేణుల ధ్వజం



మాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ శ్రేణుల పాదయాత్ర

యాచారం: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మాల్ కేంద్రం నుంచి ఎమ్మార్పీఎస్ శ్రేణులు మాదిగల సంగ్రామ పాదయాత్ర చేపట్టారు. మాల్, నల్లవెల్లి గ్రామాల మీదుగా పాదయాత్ర జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో నాయకులు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వస్తే ఎస్సీ (ఏబీసీడీ) వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మాటమార్చిందని అన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనైన ఎస్సీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీతో తాడోపేడో తెల్చుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నర్సింహ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి శేఖర్, ఎంఎస్ఎఫ్ ఇబ్రహీంపటన్నం నియోజకవర్గ సమన్వయకర్త పాండు, యాచారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేష్, అధికార ప్రతినిధి మహేష్, నాయకులు లింగం, శ్రీకాంత్, ఆనంద్, అదిత్య, ప్రవీణ్, యాదయ్య, చంద్రకాంత్, విక్రమ్ పాల్గొన్నారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించండి: యూటీఎఫ్

మంచాల: మహబూబ్‌నగర్–హైదరాబాద్–రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్న గారి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీయస్ యూటీఎఫ్ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న నాయకుడు మాణిక్‌రెడ్డి అన్నారు. ఈకార్యక్రమంలో ఆ సంఘం మంచాల మండల అధ్యక్షుడు అజ్మత్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి బాలునాయక్, గౌరవ అధ్యక్షుడు తుల్జారాం, నాయకులు నాగేష్, యాదగిరి, రవింధర్, శ్యామల, విశారద, మహేందర్, రుబీనా పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఆమనగల్లు: దేవాలయాల అభివృద్ధికి ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహకారం అందిస్తామని ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి చెప్పారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కంఠ మహేశ్వరస్వామి, ఎల్లమ్మ దేవాలయాలను ఆదివారం ఆయన సందర్శించారు. ప్రజల్లో భక్తిభావం పెంపొందించడానికి ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఉపసర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు నర్సింహగౌడ్, రాముగౌడ్, వీరేశ్, కొండల్, తిరుపతయ్యగౌడ్, చంద్రమౌళి, నరేందర్‌రెడ్డి, వెంకటయ్య, జంగయ్య, బాలయ్య, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్



పరమేశ్‌కు ఓటర్‌లిస్ట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధ్యక్షతన ఈనెల 8న మండల పరిధిలోని ముద్వీన్ గ్రామంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సలహాలు, సూచనలు తీసుకోని ముందుకు సాగడమే ధ్యేయంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మేళన కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర ప్రతినిధులతో పాటు ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, వైస్ ఎంపీపీ ఆనంద్ హాజరవుతున్నట్లు తెలిపారు. ముద్వీన్, చరికొండ, పల్లెచెలక, గోవిందాయిపల్లి, గోవిందాయిపల్లి తండా, మర్రిపల్లి, ఎక్వాయిపల్లి, అన్మాస్‌పల్లి గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు మండలంలో పార్టీ బూత్ కమిటీలు, ఇన్‌చార్జిలను నియమించుటకై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్‌కు ఆదివారం ఓటర్ లిస్టును ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయిలు తదితరులు ఉన్నారు.

వైభవంగా కల్కిదోనగుట్ట బ్రహ్మోత్సవాలు



రథోత్సవంలో భక్తులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ కల్కిదోనగుట్ట గోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున రథోత్సవాన్ని(పెద్దతేరు) ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై గోపాలస్వామి వారి ఉత్సవ విగ్రహాలను అధిష్టింపజేశారు. ఆలయ ధర్మకర్త సిదాంతి పట్టాభిరామశర్మ స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండరీ ట్రస్టు చైర్మన్ పట్టాభిరామశర్మ, ఆలయ కార్యనిర్వాహక ముఖ్య సభ్యులు కృష్ణమూర్తిశర్మ, నితిన్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

వీఆర్‌వన్ ఫౌండేషన్ అధినేత వెంకటేశ్వరరెడ్డి



విద్యార్థినికి ప్రోత్సాహకం అందజేస్తున్న సభ్యులు

మంచాల: విద్యార్థులు కష్టపడి చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని వీఆర్‌వన్ ఫౌండేషన్ అధినేత కుకుడాల వెంకటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కె.భిక్షపతి అన్నారు. ఆదివారం మంచాల మండల కేంద్రంలో వీఆర్‌వన్ ఫౌండేషన్ ద్వారా పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఐ–సాట్ 2023 పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పారితోషికాలు అందజేశారు. మొదటి బహుమతి ట్యాబ్, ద్వితీయ బహుమతి స్మార్ట్ ఫోను, తృతీయ బహుమతి రూ.5వేలు, 4వ, 5వ బహుమతి రూ.3వేల చొప్పున అందజేశారు. ఈ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రోత్సాహకంగా 10వ తరగతి స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్‌రెడ్డి, మోటివేషన్ స్పీకర్ మొగులప్ప, ఆరుట్ల ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, ఫౌండేషన్ సభ్యులు శ్రీశైలం, బాలరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తోటి విద్యార్థినులకు సన్మానం



తోటి విద్యార్థినులను సన్మానించిన 1983-84 బ్యాచ్ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1983–84 బ్యాచ్ ఎస్ఎస్‌సీ పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆ బ్యాచ్ విద్యార్థినులను అప్పటి తోటి విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళలకు కండువాలను కప్పి వారితో కేక్ కట్ చేయించారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూడిద నందారెడ్డి, రైల్వేబోర్డు మాజీ మెంబర్ రమేష్‌రాజు, రేణుక, వసుంధర, సునీత, వీరమణి, రాజేశ్వరి, సరళ, గ్లోరి, లింగమ్మ, సుజాత, అన్నపూర్ణ, సువర్ణ, నందకుమార్, సంజీవ, నాగభూషణం, శ్యామ్, చండీశ్వర్, భద్రప్ప, విజయప్రతాప్ పాల్గొన్నారు.